ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

సోమవారం 27 అక్టోబరు 2025 | 5

సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం

» కవిసంధ్య దశాబ్ది ఉత్సవంలో మల్లాడి

» యానాంలో ఘనంగా శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం 7

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎంపీ ఉదయ్

కాకినాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కాకినాడ తీరాన్ని తాకే ప్రమాదం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సూచించారు. తుపాను ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అంచనా నేపథ్యంలో ప్రజలందరూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మత్స్యకార గ్రామస్థులు మరింత జాగ్రత్త వహించాలని అన్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటిని వదిలితే జగ్గంపేట, పిఠాపురం, నియోజకవర్గంలో పలు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఎంపీ తెలిపారు. తుపాను ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఐదురోజులపాటు విద్యాసంస్థలకు సెలవు

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 31 వరకు ఐదురోజులపాటు ప్రభుత్వ, ప్రైవేటుస్కూల్స్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలు ఇచ్చారు. మొంథా తుఫాన్ కారణంగా ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో విద్యాసంస్థలకు ఐదురోజులు సెలవుదినాలుగా ప్రకటించామన్నారు. సాంఘిక సంక్షేమ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులందరినీ వారి సొంతగృహాలకు చేర్చాలని ఆదేశించారు. తనఆదేశాలను జేఎన్‌టీయూకే, డీఈవో, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, ఆర్‌జేడీ స్కూల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులు, ఆర్‌జేడీ హయ్యర్ ఎడ్యుకేషన్, ఐటీఐ అధికారులు అమలు చేయాలని కోరారు.

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

» కలెక్టర్ షాన్‌మోహన్, తుఫాన్ ప్రత్యేకాధికారి కృష్ణతేజ

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పూర్తి సన్నద్ధతతో ఉండాలని కలెక్టర్ షాన్‌మోహన్, తుఫాన్ జిల్లా ప్రత్యేకాధికారి మైలవరపు కృష్ణతేజ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంనుంచి వారిద్దరూ జిల్లా అధికారులతో ఆదివారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తీరప్రాంత అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలకు అవసరమైన నిత్యావసర వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తుఫాన్ జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణతేజ మాట్లాడుతూ బలహీనంగా ఉన్న కాలువగట్లను గుర్తించి ఇసుకబస్తాలు వేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం సరఫరా సక్రమంగా సాగాలన్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకోండి: ఎంపీ సానా

సామర్లకోట,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో యుద్ధప్రాతిపదికన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌లకు ఒక ప్రత్యేకలేఖ రాశారు. తీరప్రాంతం, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, విద్యుత్, సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉంచాలని, ఆహార, వైద్యసరఫరాలు, పటిష్టమైన భద్రతా షెల్టర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఏడీబీ రోడ్డు కొప్పవరంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజల సహాయం, పరిపాలనలో సమన్వయం కోసం 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు.



ముంచుకొస్తుందా : ఉప్పాడ కొత్తపల్లిలో ముందుకొస్తున్న సముద్రం

ముప్పుందా!

పొంచి ఉన్న తుఫాన్ ముప్పు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది.. కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ముప్పు తప్పదని..110 కిలో మీటర్ల వేగంతో దూసుకొస్తోందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. కొన్ని గంటల్లో వాయుగుండంగా బలపడి మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుఫాన్‌గా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కాకినాడకు 880 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుఫాన్ ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం రాత్రి తీరం దాటే అవ కాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, భారీ నష్టాలు సంభవించే ప్రమా దం ఉందన్న హెచ్చరికలతో అధికారులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. సిబ్బందిని అలర్ట్ చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం హోప్‌ఐలాండ్‌లో ఉన్న మత్స్యకార కుటుంబాలకు చెందిన 110 మందిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ మం డలం తూరంగిలో ఉన్న హోప్‌ఐలాండ్ కాలనీకి తరలించినట్టు కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తెలిపారు.తీర గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలిస్తున్నారు. బీచ్ రోడ్డుకి చేర్చి ఉన్న గృహాలను సైతం ఖాళీ చేయించారు. తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు రూ.50 లక్షలు కేటాయించారు.

విద్యుత్‌శాఖ సంసిద్ధం

ఏపీఈపీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల పర్యవేక్షణకు కార్పొరేట్ కార్యాలయం నుంచి సీజీఎం, ఎస్ఈ, ఈఈ, డీఈఈలకు బాధ్యతలు అప్పగించారు. అత్య వసర సేవలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.పోల్స్‌ఇతర సామగ్రిని తుఫాన్ ప్రభావ జిల్లాలకు తరలించే పనిలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

» ఉమ్మడి జిల్లాలో రేపు అలజడి

» కాకినాడలో తీరం దాటే అవకాశం

» యంత్రాంగాలు అప్రమత్తం

» కాకినాడ తీరంలో రెడ్ అలర్ట్

» ఉప్పాడ బీచ్‌కు రాకపోకల బంద్

» స్కూళ్లు, కాలేజీలకు సెలవులు

» ఉద్యోగులకు సెలవులు నిలుపుదల

» ఇళ్లకు తరలిన హాస్టల్ విద్యార్థులు

» ఏజెన్సీలోనూ అప్రమత్తం

» పాపికొండల పర్యటన నిలుపుదల

» ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు

బీచ్ రోడ్డులో రాకపోకలు బంద్

తుఫాన్ హెచ్చరికలతో ఆదివారం సాయంత్రం నుంచి కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. బీచ్ రోడ్డుకు ఇరువైపులా పోలీసు బందోబస్తు చేపట్టారు. వాహనాలు అటుగా వెళ్లకూడదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సముద్రస్నానానికి వెళ్లే భక్తులు బీచ్‌కు వెళ్లకూడదని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దంటూ మత్స్యకార గ్రామాల్లో రెవెన్యూ యంత్రాంగం టాంటాం వేయించింది.

ఏజెన్సీలో అప్రమత్తం
పాపికొండల పర్యటన నిలుపుదల

దేవీపట్నం/రంపచోడవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా పాపికొండలు పర్యటన తాత్కాలికంగా నిలిపివేసినట్టు సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆదివారం తెలిపారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా దేవీపట్నం మండలం పోశమ్మ గండి ఫెర్రీ పాయింట్ వద్ద పాపికొండల పర్యాటక బోటు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పర్యాటకులు,బోటు యాజమాన్యం, బోటు సిబ్బంది ఆదేశాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. రానున్న మూడురోజుల్లో మొంథా తుఫాన్ ప్రభా వంతో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉందన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాల యంలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 630772025, 08864-243561ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యా సంస్థలకు అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా 28,29 తేదీల్లో సెలవులు ప్రకటించారు.



గొల్లప్రోలులో హాస్టళ్ల నుంచి ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

బడులు బంద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కాకినాడ జిల్లాకు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ శుక్రవారం వరకు ఐదు రోజులపాటు విద్యాశాఖాధికారులు సెలవులు ప్రకటించారు. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు 27,28,29 తేదీల్లో సెలవులు ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లోను తదుపరి సమాచారం ఇచ్చే వరకు పాఠశాలలను తెరవొద్దని ఆదేశించారు. ఉపవిద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డులన్నీ సురక్షితంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని పాఠశాలలను తుఫాన్ పునరావాస కేంద్రాలుగా సిద్ధం చేస్తున్నారు.హాస్టళ్లలోని విద్యార్థులను ఇళ్లకు పంపేశారు.అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉద్యోగులకు సెలవుల్లేవు..

ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. అతి పెద్ద తుఫాన్‌గా వాతావరణశాఖ హెచ్చరించడంతో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని, తుఫాన్ సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, నష్ట నివారణ లేకుండా సన్నద్ధం కావాలని అధికారులు ఆదేశి స్తున్నారు. రానున్న నాలుగు రోజులూ ఎటువంటి సెలవులు ఉన్నా.. వాటిని రద్దు చేసుకుని విధులకు తప్పకుండా హాజరుకావాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రద్దు చేశారు.

తుఫాన్ వస్తే ఏం చేయాలి..

- అధికారుల సమాచారం కోసం మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉంచుకోవాలి. అత్యవసర ఎస్ఎంఎస్‌లను చూడాలి. సమాచారాన్ని గుర్తించాలి. ప్రమాదకరంగా ఉంటే వెంటనే అప్రమత్తం కావాలి.
- అధికారుల సూచనల ప్రకారం సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలి.
- పుకార్లు, వదంతులు నమ్మకూడదు.
- బయటకు వెళ్లకూడదు. ప్రమాదకర ప్రాంతాలకు అసలు వెళ్లకూడదు. పాతభవనాలు, చెట్లు, విద్యుత్‌వైర్లు వంటి ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- భారీవర్షాల సమయంలో ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్ఛాఫ్ చేయాలి. అన్ని ఎలక్ట్రిక్ గృహోపకరణాలను ప్లగ్ నుంచి తీసేయండి.
- మత్స్యకారులు వేటకు వెళ్లకూడదు.
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భవనాలపై సెల్ టవర్లు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. అవి కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అనుమానం ఉంటే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలి.
- అత్యవసర సహాయ నెంబర్లు 112, 1070, 18004250101 నెంబర్లను సంప్రదించాలి.

తుఫాన్‌పై నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కి సంబంధించిన ఏర్పాట్లపై కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్షలో తుఫాను ప్రత్యేకాధికారి కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, అధికారులు పాల్గొంటారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేశామని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు.

కోరంగి అభయారణ్యంలోకి ప్రవేశం లేదు: అటవీశాఖాధికారి

కాకినాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా సోమవారం నుంచి బుధవారం వరకు కోరింగ అభయారణ్యంలోకి పర్యాటకులను అనుమతించబోమని జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో 269 పునరావాస కేంద్రాల ఏర్పాటు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో బాధితులు బస చేయడానికి జిల్లావ్యాప్తంగా 269 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ రూరల్ మండలంలో 7, కాకినాడ అర్బన్‌లో 16, తాళ్లరేవులో 16, కరప 1, కాజులూరు 26, పెదపూడి 1, సామర్లకోట 5, పిఠాపురం 24, గొల్లప్రోలు 14, యు.కొత్తపల్లి 21, కిర్లంపూడి 21, జగ్గంపేట 18, రౌతులపూడి 14, తొండంగి 37, ఏలేశ్వరం 6, శంఖవరం 19, కోటనందూరు 16, పెద్దాపురం మండలంలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాలన్నీ ప్రభుత్వ భవనాలు, పాఠశాల భవనాలు, సంక్షేమ వసతిగృహాలు, గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు, ఇతర సౌకర్యాలు కల్పించి నిత్యావసర వస్తువులన్నింటినీ సోమవారం మధ్యాహ్నంలోపు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో పరిశుభ్రమైన భోజనం అందించాలన్నారు.

అట్టర్..ప్లాట్లు!

» అంచనాలు తలకిందులు

» అంతంతమాత్రమే స్పందన

» ముగిసిన ఎల్ఆర్ఎస్ గడువు

» మళ్లీ గడువు పొడిగించేనా?

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు ఇచ్చిన 90 రోజులు గడువు ముగిసింది. గతంలో అవకాశం ఇచ్చినా అర్ధంతరంగా నిలిపివేసింది. ఈ సారి పూర్తిస్థాయిలో 90రోజులు గడువిచ్చినా పథకానికి తొలినుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. భారీగా దరఖాస్తులు వస్తాయన్న పాలకులు, అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లాలోని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కౌడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా), తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా), బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ అర్ధంతరంగా నిలిపివేసి దీనికి కొన్ని సవరణలు చేసి 2025, జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవో ఎంఎస్ నెంబరు 134ను 2025, జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.ఆ గడువు ముగిసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అధికారులు అంచనా వేస్తున్నారు.

మొక్కుబడిగానే దరఖాస్తులు..

గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడడంతో పాటు స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మూడు నెలల గడువిస్తూ అక్రమ లేఅవుట్లు, అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. కాకినాడ(కౌడా) పరిధిలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) పరిధిలో 1,005 దరఖాస్తులు క్రమబద్ధీకరణకు లేఅవుట్ల, ప్లాట్ల యజమానులు ముందుకు వచ్చారు. వీటిలో ఎక్కువగా ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులే ఉన్నాయి. ప్రభుత్వం అవకాశం కల్పించినా పూర్తిస్థాయిలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అందరూ ముందుకు రాలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మళ్లీ గడువు పొడిగించేనా?

ఎల్ఆర్ఎస్ గడువు ముగిసింది. ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందా.. గడువును పొడిగిస్తుందా.. అన్న సందేశాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు సైతం వచ్చిన దరఖాస్తులపై సంతృప్తి చెందకపోవడంతో గడువు పెంపునకు కృషి చేస్తారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువులో పూర్తిస్థాయిలో అక్రమ లేఅవుట్ల యజమానుల క్రమబద్ధీకరణకు వచ్చి ఉంటే ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లు జమయ్యే అవకాశం ఉండేదని అధికారులు అంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు మూడురోజుల మూసివేత

» ఐసీడీఎస్ పీడీ

సామర్లకోట,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను, అధిక వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 27, 28, 29(సోమ,మంగళ,బుధవారాలలో)ల్లో సెలవులు ప్రకటించినందున జిల్లాలోని 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించినట్లు జిల్లా ఐసీడీఎస్ పీడీ లక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు జిల్లాలోని 9ప్రాజెక్టుల సీడీపీవోలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కేంద్రాలు యథాతథంగా తెరవాలని ఆదేశాలలో పేర్కొన్నారు.






హోప్‌ఐలాండ్ నుంచి బోటులో వస్తున్న మత్స్యకారులు

హోప్‌ఐలాండ్‌నుంచి బయటకు..

కాకినాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో కాకినాడ తీరానికి దగ్గర్లో హోప్‌ఐలాండ్‌లో నివసిస్తున్న మత్స్యకారులను పోలీసులు, ఇతర శాఖల అధికారులు బయటకు తీసుకువచ్చారు. అక్కడ 110మంది వరకు నివసిస్తుండగా వారిని బోట్లలో తీసుకువచ్చి కాకినాడలోని పునరావాస కేంద్రాలకు తరలించారు.

'ఏలేరు'లో స్వల్పంగా తగ్గిన నీటినిల్వలు



ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు

పిఠాపురం/గొల్లప్రోలు/ఏలేశ్వరం, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. మొంథా తుఫాన్ దృష్టిలో ఉంచుకుని కాలువలకు నీటి విడుదలను పెంచాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రెండురోజులుగా ఎండ కాస్తుండడం, ఏలేరు క్యాచ్‌మెంట్ ఏరియాగా ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో పెద్దగా వర్షాలు పడకపోవడంతో ఇన్‌ఫ్లోస్ తగ్గాయి. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లో నీటి మట్టం 85.50మీటర్లుగా ఉంది. రెండురోజులక్రితం ఇది 85.58 మీటర్లుగా ఉంది. రిజర్వాయర్‌లో నీటి నిల్వలు 22.12 టీఎంసీలు నుంచి 21.96టీఎంసీలకు తగ్గాయి. ఇన్‌ఫ్లోస్ 2475 క్యూసెక్కులనుంచి 1000 క్యూసెక్కులకు తగ్గాయి. శనివారం మధ్యాహ్నంనుంచి నీటి విడుదలను 3175 క్యూసెక్కులకు పెంచగా ఆదివారం రాత్రి వరకూ అదేస్థాయిలో విడుదల చేస్తున్నారు. ఇందులో 2400 క్యూసెక్కులను స్పిల్‌వే ద్వారా, 600 క్యూసెక్కులను డీసీఆర్ స్లూయిజ్ ద్వారా విడుదల చేస్తుండగా, విశాఖ అవసరాలకు 175 క్యూసెక్కులను పంపుతున్నారు.

బలహీన గట్లతో కలవరం

గతేడాది ఏలేరు, సుద్దగడ్డకు సంభవించిన భారీవరదలతో ఏలేరు, పీబీసీ కాలువల గట్లు చిన్నాభిన్నమయ్యాయి. పిఠాపురం, జగ్గంపేట, పె ద్దాపురం, ప్రత్తిపాడు, తుని, కాకినాడరూరల్ నియోజకవర్గాల పరిధిలో 280చోట్ల గండ్లుపడ్డాయి. వీటిలో 50శాతం గండ్లను ఇప్పటికే పూడ్చగా మిగిలిన వాటిని పూడ్చాల్సి ఉంది. పలు చోట్ల గట్లు కోతకు గురయ్యాయి. వీటికి ఇప్పటి వరకూ మరమ్మతులు చేపట్టలేదు. ఏలేరు నుంచి ఏమాత్రం అధికంగా నీటిని విడుదల చేసినా గట్లు తెగిపోయి పంటపొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ పొలాలవద్ద కొందరు సొంతంగా ఇసుకబస్తాలు తాత్కాలికంగా వేసుకున్నారు. తక్షణం ఇటువంటి గట్లను పటిష్టపరచాలని వారు కోరుతున్నారు.

రైతుల్లో కలవరం

వరి పంట కీలకమైన దశలో తుఫాన్ హెచ్చరికలతో మారిన వాతావరణంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ సాగు ఈఏడాది పలు ప్రతిబంధకాల మధ్య సాగి ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. 1.50లక్షల ఎకరాల్లో వరిపంట చిరుపొట్ట, పొట్ట, ఈనిక, వరి కంకుల్లో గింజ గట్టి పడే దశల్లో ఉంది. అధిక వర్షాలు పడితే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని రైతులు కలవరపడుతున్నారు.



ఐదు రోజులుగా ముంపు నీటిలో ఆటోనగర్‌లోని ఓ వీధి

ఆటోనగర్.. దారెటో!

» ఐదు రోజులుగా ముంపులోనే

» నిలిచిన విద్యుత్ సరఫరా

» ఆటోనగర్‌లో ముంపు సమస్య

సర్పవరం జంక్షన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న ఆటోనగర్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇటీవల కురుస్తోన్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తోన్న ఏలేరు వరద నీటితో గత ఐదు రోజులుగా సర్పవరం ఆటోనగర్ వరద నీటిలో చిక్కుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 2002లో కాకినాడ రూరల్ సర్పవరంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ పార్కు పేరిట ఆటోనగర్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేసి 350 మందికి ప్లాట్లు కేటాయించింది. ఆటోనగర్‌లో మినీ వేన్‌లు, 10 టైర్స్, 12, 16 టైర్స్ వంటి భారీ వాహనాల బాడీ నిర్మాణం, మరమ్మతులకు ఇక్కడకు జిల్లా నలుమూలల నుంచి వాహనాలు వస్తాంటాయి. సుమారు 3 వేల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. ఆటోనగర్‌లో వర్షం,మురుగునీరు బయటకెళ్లేందుకు ఏర్పాటు చేసిన మెయిన్ డ్రెయిన్ శిథిలావస్థకు చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తోన్న వర్షం, వరద నీరు నేరుగా పల్లంలో ఉన్న ఆటోనగర్‌లోకి ప్రవేశిస్తోంది. ఇక్కడ నుంచి నీరు బయటకెళ్లే అవుట్ లెట్ సౌకర్యం లేక ఎక్కడ నీరు అక్కడే నిలిచి పోతోంది. ఆటోనగర్‌కు చేర్చి ఉన్న ప్రధాన కాలువ ఇరుపక్కలా సిమెంట్‌తో రివిట్‌మెంట్ చేసి.. మురుగునీరు బయటకెళ్లేందుకు ప్రధాన అవుట్‌లెట్ సౌకర్యం కల్పిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ది కాకినాడ ఆటోనగర్ అండ్ ఇండస్ట్రియల్ పార్కు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గరగ సత్తిబాబు, సెక్రటరీ కోలా జగదీష్ కోరారు. గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉన్నామని వాపోయారు.

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ



అన్నవరంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు, రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 3 గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. ఆదివారం సుమారు 5వేల జంటలు వ్రతాలాచరించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.35 లక్షల ఆదాయం లభించింది. దేవదాయ కమిషనర్ ఆదేశాలతో ఆలయంలో నిబంధనలను కఠినంగా అమలుచేశారు. పశ్చిమ రాజగోపురం వద్ద చిన్నద్వారాన్ని మూసివేశారు. సిబ్బంది తరుపున వచ్చినవారిని కూడా జనరల్ క్యూ లైన్ ద్వారానే అనుమతించారు. చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం వెనక బాగంలో ఉండి దళారులు ఎవ్వరూ దరిచేరకుండా పర్యవేక్షణ చేశా రు. ఈవో సుబ్బారావు ప్రధానాలయం, వ్రతమండపాల వద్ద రద్దీ నియంత్రణకు ఆదేశాలిచ్చారు. వాహనాలను నిర్దేశితప్రాంతంలో మాత్రమే పా ర్కింగ్‌కు అనుమతించారు. సత్యదేవ నిత్యన్నదాన పథకం ద్వారా సుమారు 6వేల మందికి ఉచిత పులిహోర దద్దోజనం అందించారు. రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు రథంవెంట నడి చి స్వామిసేవలో పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో..



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఆది వారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి గణపవరానికి చెందిన కొండేటి వెంకటరత్నం రూ.30,116.. రాజమహేంద్రవరానికి చెందిన భూపతిరాజు సాయిశరత్‌వర్మ రూ. 36,500 విరాళాలు సమర్పించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ శ్రీరామ రాహుల్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు అందించారు. వారికి అర్చక బృందం వేద మంత్రాలతో స్వాగతం పలకారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎస్పీ దంపతులకు చిత్రపటం అందిస్తున్న డీసీ

30 రోజులు.. 100 ప్రసవాలు!

- రికార్డు సృష్టించిన చింతూరు ఏరియా ఆసుపత్రి
- వైద్యులను అభినందించిన ఐటీడీఏ పీవో

చింతూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 30 రోజుల్లో 100 ప్రసవాలతో అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని చింతూరు ఏరియా ఆసుపత్రి రికార్డు సృష్టించింది. దీంతో ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ఆదివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, గైనకాల జిస్టులు డాక్టర్ రమణా రావు, డాక్టర్ శశికళను అభినందించారు. మొన్నటి వరకు గర్భిణులకు ప్రసవ తీరులో కాసింత సమస్య ఉందంటే చాలు ఇక్కడ నుంచి తెలంగాణలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించేవారు. ఈ క్రమంలో గర్భిణులతో సహా ఆయా కుటుంబాలు నానా అవస్థలు పడాల్సివచ్చేది. ఒక్కోసారి ప్రాణాంతక పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేది. అంతేకాక పలు సందర్భాల్లో పరిస్థితి విషమించడం, అక్కడి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి రావడం తదుపరి పేద, ఆదివాసీ కుటుంబాలు ఆసుపత్రుల బిల్లుల కోసం అప్పుల పాలైన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల చింతూరు ఆసుపత్రిని ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటుగా అదే దశలో ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి స్వయంగా అనస్థిసియా డాక్టర్ (మత్తు మందు వైద్యుడు) కావడం అదేదశలో ఇరువురు గైనకాల జిస్టులను ప్రభుత్వం ని య మించడంతో ప్రసవ వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. అం తేకాకుండా ప్రసవాలకు తెలంగాణకు తరలించాల్సిన అవసరం దాదాపు లేకండా పోయింది. ఇటీవల ప్రసవాలపై ఆసుపత్రి సూప రింటెండెంట్ కోటిరెడ్డి బృందం ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక ప్రత్యేక వసతులతో కూడిన నవజాతి శిశు కేంద్రం (ఎస్‌ఎన్‌సీయూ) ఏర్పాటుచేయడం ఆ మేరకు ప్రత్యేక వైద్యనిపుణుడిని నియమించడంతో శిశుమరణాల సంఖ్య గణనీ యంగా తగ్గింది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవ రిలో 64, ఫిబ్రవరి 48, మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జులై 50, ఆగస్టు 92, సెప్టెంబరు 95, ఇక సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 26 వరకు 30 రోజుల్లో 100 ప్రసవాల టార్గెట్‌ను సాధించి జిల్లా రికార్డును సొంతం చేసుకోవడంతో ఉన్నతాధికారుల నుంచి ఆసుప త్రి వైద్యులు,సిబ్బంది అభినందనలు అందుకున్నారు.



చింతూరు ఆసుపత్రిలో ప్రసవ మహిళల వార్డు



చింతూరు ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు

న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగుళూరు ఇంటర్నేషనల్ టాలెంట్ బ్యాడ్మింటన్ టోర్నమెంటుకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు ఆదివారం ఆయన తెలిపారు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్, బ్యాడ్మింటన్ ఆసియా అసోసియేషన్, కర్ణాటక బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగుళూరులో ఈపోటీలు నిర్వహిస్తారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రేడ్-1 నేషనల్ ఎంపైర్‌గా వ్యవహరిస్తున్న పాయసం శ్రీనివాసరావు ప్రస్తుతం నల్లచెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మంగుళూరులో టోర్నమెంట్ ఈనెల28 నుంచి నవంబరు 2వరకు ఉరవ ఇండోర్ స్టేడియంలో జరుగుతుందన్నారు. న్యాయ నిర్ణేతగా మరోసారి నియమితులైన శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి బాలు, కోనసీమ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమణబాబు అభినందించారు.

సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం అందించాలి

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాంలో కవిసంధ్య దశాబ్ది ఉత్సవం



యానాంలో కవిసంధ్య ప్రత్యేక సంచికను అవిష్కరిస్తున్న అతిథులు

యానాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, కళా, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం అందించాల్సిన ఆవశ్యకత ఉందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం యానాం అంబేడ్కర్ నగర్ కల్యాణమండపంలో కవిసంధ్య సాంస్కృతిక సంస్థ దశాబ్ది ఉత్సవం, శిఖామణి సాహిత్య పురస్కారాల ప్రదానం జరిగింది. కవిసంధ్య అధ్యక్షుడు కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా మల్లాడి మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యవంతం చేస్తారన్నారు. వారి రచనలు పుస్తక రూపంలోకి తీసుకురావడానికి కొంతమంది ఇబ్బంది పడతారని, అటువంటి కవులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ముగ్గురు స్థానిక కవులకు, మరో ముగ్గులు ఆంధ్ర, తెలంగాణకు చెందిన కవులకు పుస్తకాల ముద్రణకు ఆర్థిక సహాయం, అలాగే కవిసంధ్య కార్యక్రమాలను తోడ్పాటు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కవులు దాట్ల దేవదానం రాజు, వరుగు భాస్కరరెడ్డి, డానియల్ నెజర్స్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్లకూరి శైలజ, బొల్లోజు బాబా, కుంచే నాగసత్యనారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా కవిసంధ్య-56 ఆరుద్ర బైరాగీ శత జయంతి సంచికను మల్లాడి కృష్ణారావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రచించిన సదా స్మరణీయులు సంచికను డెనియల్ నెజర్స్ ఆవిష్కరించారు.

శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం

సాహిత్యంలో జీవన సాఫల్యం కృషికి ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు, అలాగే కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారాన్ని అవధానుల మణిబాబుకు మల్లాడి అందజేశారు. పూలమాలలు, శాలువా, మెమోంటో, సన్మానపత్రంలో సత్కరించి నగదు బహుమతి అందజేశారు. సన్మాన గ్రహీతలు తమ స్పందన తెలిపారు.

పదిమందికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం

వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళితసాహిత్యం తదితర అంశాల్లో పది మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఎస్.ఆర్.పృథ్వీ (దీర్ఘకవితలు), పీఆర్ఎల్‌స్వామి (కవిత్వధారణ), బీహెచ్‌వీ.మంగేష్ (పత్రికారంగం), పచ్చిమాల శివనాగరాజు (పద్య కవిత్వం), డాక్టర్ వరగు భాస్కరరెడ్డి (పరిశోధన), కోయి కోటేశ్వరరావు (దళిత సాహిత్య విమర్శ), పుప్పాల సూర్యకుమారి (నవల సాహిత్యం), పొనుగుమట్ల అశోక్‌కుమార్ (వచన కవిత్వం), పెనుమాక రత్నాకర్ (కథా సాహిత్యం), మిరప మహేష్ (వచనకవిత్వం)లకు కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. ఇనాక్ సాహిత్యంపై డాక్టర్ కోయి కోటేశ్వరరావు, అవధానుల మణిబాబు కవిత్వంపై డాక్టర్ కాళ్లకూరి శైలజ మాట్లాడారు. ఈ సందర్భంగా శిఖామణి మాట్లాడుతూ ప్రతీ ఏటా అందించే పురస్కారాలకు కమిటీ ద్వారా కవులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మల్లాడి కృష్ణారావు సౌజన్యంతో పురస్కారాలను ప్రదానం చేసినట్టు తెలిపారు. పదేళ్లగా కవిసంధ్య పత్రికను ఎన్నో కష్టనష్టాలకోర్చి వెలువరిస్తున్నట్టు తెలిపారు. కవిసంధ్యకు అండగా నిలుస్తున్న మల్లాడికి కృతజ్ఞతలు తెలిపారు. కవులు మదునాపంతుల సత్యనారాయణమూర్తి, రచయితలు పాల్గొన్నారు.

సమాజం చైతన్యవంతానికి సాహిత్యం బాసట : ఇనాక్

సమాజం చైతన్యవంతంగా పురోగమించడానికి సాహిత్యం బాసటగా నిలుస్తుందని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శిఖామణి పదేళ్లుగా కవిసంధ్య పత్రికను ఒంటిచేత్తో విజయవంతంగా వెలువరించడం అభినందనీయమన్నారు. యానాంలో సాహిత్య, కళారంగాలకు మ ల్లాడి కృష్ణారావు సహకారం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. సాహితీపరంగా యా నాం మరింత పురోగతి సాధించగలదని ఆకాంక్షించారు. శిఖామణి తన మనమడు కోసం రాసిన కవితలు చదివానని, చిన్న పిల్లవాడిని అయ్యానని, శిఖామణి కవిత్వం అంతగా కదిలిస్తుందని తెలిపారు. ఈ సభ మంచి అనుభూతిని మిగిల్చిందన్నారు.

తుఫాన్ ఎఫెక్ట్

సఖినేటిపల్లి రేవులో రాకపోకల నిలిపివేత

అంతర్వేది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిపివేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలకు ఏ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో పంటు ప్రయాణాలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. తుఫాను తీవ్రతన ఆధాంగా తదుపరి రాకపోకలు సమచారం ప్రయాణికులకుతెలియచేస్తామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



మరణించిన చిట్టెమ్మ

జగ్గంపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గుర్రపాలెం గ్రామ శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళితే సాగరపేటకు చెందిన నక్క వెంకన్న తన భార్య చిట్టెమ్మ(42) కలిసి ఆదివారం ఉదయం గ్రామం నుంచి జగ్గంపేట పనికి వెళ్లారు. ముగించుకుని తిరిగి తమ మోటార్‌సైకిల్‌పై ఇంటికి వచ్చే క్రమంలో గుర్రప్పాలెం గ్రామ శివారున ట్రాక్టర్ ఢీకొంది. తీవ్ర గాయాలైన చిట్టెమ్మను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మరణించినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలులో షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తం

బిక్కవోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన సతీమణి మహాలక్ష్మితో కలసి పందిరిరాట వేసి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే దంపతులు ముందుగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం పందిరిరాట వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు చాళుక్యులు త్రిమందిర్ పేరుతో బిక్కవోలులోని లక్ష్మీగణపతి, గోలింగేశ్వర ఆలయాలు, గొల్లలమామిడాడలోని సూర్యనారాయణస్వామి ఆలయాలను కేంద్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రసాద్ పథకంలో రూ.92.5 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 2 వరకూ షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తామని, నవంబరు 26న స్వామి వారి షష్ఠి ఉత్సవం జరుపుతామని షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రావాడ నాగు, ఇందల వీరబాబు, చాగంటి సాయిబాబారెడ్డి. బేరా వేణమ్మ, జుత్తుగ సూర్యకుమారి, రెడ్డి నాగవేణికుమారి, నడింపల్లి సూర్యకుమారి, పడాల రాము, తనుకు శ్రీధర్, పలువురు అధికారులు ఉన్నారు.



బిక్కవోలులో షష్ఠి ఉత్సవాలకు రాట వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు 36 మంది క్రీడాకారులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ పోటీలను ఆదివారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రౌండ్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మెన్, ఉమెన్ విభాగాల్లో జరిగిన పోటీల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ ప్రథమ స్థానంలో పిఠాపురం, ద్వితీయ స్థానంలో రాజమహేంద్రవరం, తృతీయ స్థానంలో కాకినాడ క్రీడాకారులు నిలిచారు. ప్రతిభ ఆధారంగా 36 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు నవంబరు 1, 2, 3న విజయవాడలో జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలకు ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఏపీ ఇంటర్మీడియట్ నాన్ గెజిటెట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.సురేష్‌కుమార్, కె.పద్మనాభం, రమణ, చిన్నబ్బాయి బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా ముమ్మిడి గణేష్, జి.శివప్రసాద్,పి.పవన్ వ్యవహరించారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఒడిసా టు కోయంబత్తూరు..

గంజాయి తరలిస్తుండగా పట్టివేత

రూ. 8 లక్షల విలువైన సరుకు స్వాధీనం

ఆటో, లారీ సీజ్... ముగ్గురిపై కేసు



నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒడిసా ప్రాంతం నుంచి కోయంబత్తూరుకు తరలిస్తున్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తూర్పు గోదావరి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్.లావణ్య తెలిపారు. కొవ్వూరు గామన్ వంతెన దిగువన దొమ్మేరు రోడ్డులో ఆటో నుంచి లారీలోకి గంజాయి ఎక్కి స్తున్నారని కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి తీసుకువచ్చిన ఆటో, రవాణా చేస్తున్న లారీలను సీజ్ చేసి 86 ప్యాకెట్లలో ఉన్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి డొంకరాయికి చెందిన ఆటోలో డ్రైవర్ గంజాయిని కొవ్వూరు తీసుకువచ్చాడు. ఇక్కడి నుంచి కొయంబత్తూరుకు తరలించేందుకు లారీలో ఎక్కిస్తుండగా డొంకరాయికి చెందిన ఆటో డ్రైవర్, తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్, క్లీనర్‌లను అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు డి.అప్పారావు, రవిశంకర్, ఐఎన్ఎస్.బాలాజీ, సిబ్బంది ఉన్నారు.

ఎద్దులు అక్రమంగా కబేళాకు తరలింపు

ఇద్దరి అరెస్ట్



వ్యాన్‌లో తరలిస్తున్న ఎద్దులు

రాయవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎద్దులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా జగ్గంపేట సంత నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి అక్కడి నుంచి ఐషర్ వ్యాన్‌లో నెల్లూరుకు అక్రమంగా 16 ఎద్దులు, 14 దూడలను తరలిస్తుండగా రాయవరం పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. రామచంద్రపురం శివారు కొత్తురుకు చెందిన నంసేను, రామచంద్రపురానికి చెందిన వెట్రివేల్‌ను అదుపులోకి తీసుకున్నారు. టీఎన్ 66ఏబీ 8740 ఐషర్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఎద్దులు, దూడలను సామర్లకోట గోశాలకు తరలించి వ్యాన్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు.

తునిలో పోలీస్ కార్డన్ సెర్చ్

పత్రాలు లేని 23 బైక్‌ల స్వాధీనం

తునిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గంజాయి, సారా విక్రయాలు పెరిగిపోయాయని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కాకినాడ జిల్లా తుని పోలీసులు ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 4 గంటల నుంచి 7గంటల వరకు పట్టణాన్ని జల్లెడ పట్టారు. సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐ విజయ్‌బాబు, కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ, తుని టౌన్, రూరల్ పోలీసులతో పాటు కాకినాడ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు ప్రధాన కూడళ్లల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానం ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 23 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసులు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.



తునిలో బైక్‌లను స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు

రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా బ్రాంచి గోల్డెన్ జూబ్లీ వేడుకలు



గోల్డెన్ జూబ్లీ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్రాంచి 50వ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆదివారం కాకినాడలోని కార్యాలయంలోని ఆవరణలో ఘనంగా నిర్వహించారు. జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలషుల సమక్షంలో ప్రత్యేక సంచికను (సావనీర్) ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్య ఆధ్మాతిక పీఠం పీఠాధిపతి ఉమర్ ఆలీషా మాట్లాడుతూ సంఘం 50 వసంతాలు పూర్తి కావడం చాలా ఆనందం కలిగించిందన్నారు. ఉద్యోగి కాకపోయినా గౌరవంతో ఆహ్వానించినందుకు అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సేవలను విస్తరించాలని ఆక్షాంక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సాలగ్రామ లక్ష్మి ప్రసన్న, టీడీపీ నాయకుడు మీసాల రాజు, చలపతి నాయుడు, కృపారత్నం, ఏటివోడీ అపర్ణ ప్ర సంగించారు. 50 ఏళ్లలో సంఘం సేవలను, కృషిని కొనియాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ని శాస్త్రీ, జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, జిల్లా ప్రధాన కార్యదర్శిటి నూకరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇబ్రహీం, సరోజిని రాష్ట్ర కార్యదర్శి షాజీదా హాజరయ్యారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైన సంఘం సాధించిన విజయాలను కార్యవర్గం సభకు తెలియజేసింది.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రైతు బజారుకు నేడు సెలవు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల రైతు బజారులో సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా సెలవు ప్రకటిస్తున్నట్టు రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.


కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు


కాకినాడ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో తుఫాన్ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కమిషనరు సుధాకర్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ


గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దారు రామకుమార్

మొంథా... అంతా అప్రమత్తం

తుఫాన్ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధం
ఏర్పాట్లపై సమీక్షించిన కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కమిషనరు సుధాకర్

కొత్తపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఉప్పాడ తీరం వెంబడి ఏర్పడే ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా అవలీలగా ఎదుర్కొని ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేశామని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు వెల్లడించారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం తహసీల్దారు జి.చిన్నారావు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహించారు. తీర ప్రాంత మత్స్యకార ప్రతినిధులు కూడా హాజరయ్యారు. తుఫాన్ సమయంలో బలమైన ఈదురుగాలులు వస్తే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని... ముందస్తుగా జనరేటర్లను సమకూర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. సముద్ర కెరటాలు ఉధృతంగా ఉండి తీర ప్రాంత గ్రామాల మత్స్యకారుల ఇళ్లల్లోకి దూసుకొచ్చే అవకాశముందన్నారు. మత్స్యకారుల కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడికి వచ్చేవారికి భోజనాలు పెట్టడంతో పాటు చిన్నారులకు పాలు సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో పాడా పీడీ చైత్రవర్షిణి, ఏపీడీ పి.వసంతమాధవి, ఎంపీడీవో లక్ష్మీరెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై కమిషనరు కేటీ సుధాకర్, ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ ఎంవీవీ సత్యనారాయణ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 27, 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన గాలులు వీస్తాయని, ప్రాణ-ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనరు ఆదేశించారు. ఎక్స్‌కవేటర్లు, క్రేన్లు సిద్ధంగా ఉంచాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సమీపంలోని తుఫాన్ షెల్టర్లకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులను గుర్తించి ఆసుపత్రులకు తరలించే చర్యలు ప్రారంభించాలన్నారు. దుమ్ములపేట ప్రాంతంలో 76 పాకలలో 187 మందిని, ఏటిమొగలో 75 పాకలలో 213 మందిని పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొత్తం 66 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి తాగునీరు, కొవ్వొత్తులు, జనరేటర్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని కమిషనరు వివరించారు. అత్యవసర సహాయం కోసం కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (టోల్‌ఫ్రీ నెం.1800- 425-5990) ఏర్పాటు చేశామన్నారు. విపత్తు సమయంలో సేవలందించేందుకు చేయూత, ఆల్ ఈజ్ వెల్, లిటిల్‌హార్ట్స్ స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయని వివరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాసరావు, ఎస్ఈ వెంకటరావు, తహసీల్దారు జితేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, అగ్నిమాపక అధికారి సుబ్బారాజు, ట్రాఫిక్ సీఐ ఎన్.రమేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎం.రవికుమార్, కిషోర్, ఐశ్వర్య, అటవీ, వైద్య, పశుసంవర్ధక, ఐసీడీఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడమే కాక పంచాయతీ కార్యదర్శులను పూర్తి అందుబాటులో ఉండాలని ఆదేశించినట్టు సామర్లకోట డిప్యూటీ తహసీల్దార్లు పద్మజ, వై.శ్రీనివాసులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సామర్లకోట తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డిని యు.కొత్తపల్లి మండల ప్రత్యేకాధికారిగా నియమించారు. సామర్లకోట మండల ప్రత్యేక బాధ్యతలను సామర్లకోట డిప్యూటీ తహసీల్దారు, ఎంపీడీవోలకు అప్పగించారు. తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఏఎస్వో దుర్గాప్రసాద్‌ను ఇన్చార్జిగా నియమించినట్టు తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వీఆర్వోలను అప్రమత్తం చేశామన్నారు. పెద్దాపురంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్డీఎస్ ప్రభాకర్ చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి మిగులు జలాలు విడుదల చేస్తున్నందున సామర్లకోట పట్టణంతో పాటు నవర, రావువారి చంద్రంపాలెం, పవర, గొంచాల, అచ్చంపేట గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని అధికారులు తెలిపారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. గొల్లప్రోలు పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో పరిస్థితిని తహసీల్దారు రామకుమార్ అక్కడే ఉండి సమీక్షిస్తున్నారు. అధిక వర్షాలు కురిసి ముంపు ఏర్పడితే పరిస్థితిని ఎదుర్కొని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందుకోసం పాఠశాలలు, ఇతర భవనాలను సిద్ధం చేశారు. తహసీల్దారు వెంట డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, ఆర్ఐ బాలకృష్ణ ఉన్నారు.


తహసీల్దారు గోపాలకృష్ణకు రిపోర్టు చేస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృంద అధికారులు

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

పిఠాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఎదురయ్యే పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. తుఫాన్ కాకినాడ జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో అవసరమైతే తక్షణం కార్యాచరణలోకి దిగేందుకు వీలుగా వీరు ఆదివారం సాయంత్రం పిఠాపురం చేరుకున్నారు. 30 మంది సభ్యులు తహసీల్దారు పీవీ గోపాలకృష్ణకు రిపోర్టు చేశారు. వీరికి పట్టణంలోని దేవదాయ శాఖకు చెందిన గదుల్లో వసతి కల్పించారు. పిఠాపురం నియోజకవర్గంలో ఎక్కడ అవసరమైతే అక్కడ వీరి సేవలను వినియోగించుకుంటామని తహసీల్దారు గోపాలకృష్ణ చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కాకినాడ పరిసరాల్లో తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు చేస్తున్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని, సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే ఒడ్డుకు తిరిగి రావాలన్నారు. దూర ప్రయాణాలను వాయిదా వేసుకుని ఇళ్ల వద్దే ఉండాలని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని కొండబాబు భరోసా ఇచ్చారు.

తుఫాన్ సెలవులు: ఇళ్లకు తరలిన హాస్టల్ విద్యార్థులు

పిఠాపురం/గొల్లప్రోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథాన్ తుఫాన్ ప్రభావం అధిక ఉంటుందన్న వాతావరణ శాఖ సమాచారంతో విద్యా సంస్థలకు ఐదు రోజులు సెలవులు ప్రకటించడంతో పాటు వసతిగృహాల్లో ఉంటున్న వారిని ఇళ్లకు పంపివేయాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశించింది. ఆకస్మికంగా వచ్చిన సెలవులతో ఏమి జరుగుతుందోన్న ఆందోళన, ఆపై ఆనందంతో విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో పిఠాపురం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్, ఇతర ఎస్సీ, బీసీ హాస్టల్స్, గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని బీసీ బాలురు, బాలికల వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం కావడంతో పలువురు ఉదయం నుంచే ఇక్కడకు చేరుకున్నారు. దీంతో వారికి సెలవుల సమాచారం తెలిపి విద్యార్థులను వారి వెంట పంపారు. ఉదయం నుంచి రాత్రి వరకు హాస్టల్స్, బాలికల గురుకుల పాఠశాలల వద్ద సందడి వాతావరణం నెలకొంది. గురుకుల పాఠశాలలో కొందరు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆదివారం రాత్రి వరకు రాకపోవడంతో వారిని సోమవారం ఉదయమే ఇళ్లకు పంపాలని అధికారులు నిర్ణయించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో 50 మంది విద్యార్థులు ఉండగా ఆదివారం మధ్యాహ్నానికి 25 మంది ఇళ్లకు వెళ్లిపోయారు. మిగిలిన వారిని సాయంత్రంలోగా వచ్చి తీసుకెళ్తామని వారి తల్లిదండ్రులు సమాచారం ఇచ్చినట్టు వార్డెన్ వర్మ చెప్పారు. బీసీ బాలికల హాస్టల్లోని 15 మంది విద్యార్థినులు మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు హాస్టల్‌ను మళ్లీ తెరుస్తామని వార్డెన్ శ్రీవల్లి చెప్పారు.


ఉప్పాడ-అమీనబాద్ హార్బర్‌లో మత్స్యకారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు: వర్మ

కొత్తపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కోనపాపపేట, ఉప్పాడ-అమీనబాద్ హార్బర్‌లో పర్యటించారు. మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. పునరావాస కేంద్రాల్లో భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి కార్యకర్తలతో కలిసి మత్స్యకారులకు ఇబ్బంది కలగకుండా మత్స్యకారులందరికీ భోజన సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీవ్రతను బట్టి మత్స్యకారులను మల్టీపర్పస్ తుఫాన్ షెల్టర్లు, చర్చిల్లోకి తరలించే చర్యలు చేపట్టాలన్నారు. వర్మ వెంట టీడీపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు సూరాడ రాజు, మత్స్యకార నాయకులు, పలువురు వున్నారు.

జంగం సామాజికవర్గ అభ్యున్నతికి కృషి: రాష్ట్ర ఛైర్మన్ చంద్రశేఖర్


ఐక్యత చాటుతున్న జంగం సామాజికవర్గీయులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జంగం సామాజికవర్గ అభ్యున్నతికి కృషి చేస్తానని, ప్రతి జిల్లా ప్రధాన కేంద్రంలో సామాజిక భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని రాష్ట్ర జంగం సంక్షేమ, అభివృద్ధి సంఘం ఛైర్మన్ వి.చంద్రశేఖర్ తెలిపారు. కాకినాడలోని ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో కాకినాడ జంగమ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాష్ట్రంలో జంగం సామాజికవర్గ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జంగం బీసీ-ఏ గ్రూప్ 9గా ఇవ్వాలన్న తమ డిమాండ్‌కి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, ఇందుకు సంబంధించిన గెజిట్ త్వరలో జారీ కానుందన్నారు. వివాహాది శుభకార్యాలు, వివిధ ఫంక్షన్లకు సామాజిక భవనాల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పదో తరగతి, ఇంటర్‌లలో రాణించిన విద్యార్థులకు నగదు, బహుమతులు అందించారు. సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు గరికపర్తి నమశ్శివాయ-నాగమణి దంపతులు, జిల్లా అధ్యక్షుడు వీవీఆర్ మూర్తి-శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో రాష్ట్ర ఛైర్మన్ చంద్రశేఖర్‌తో పాటు పలువురు ఆహ్వానితులను ఘనంగా సత్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మీగడ గంగరాజు, కోశాధికారి కొండపల్లి సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి కోటేశ్వరరావు, గెడ్డం వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. కార్తీక వనసమారాధనలో సుమారు 600 మంది పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్

కాకినాడ క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వార్ఫ్ రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో సీఐ ఎం.నాగదుర్గారావు బృందం ప్రత్యేక పోలీసు బలగాలతో కలిసి సుమారు రెండు గంటల పాటు తనిఖీలు చేపట్టింది. సరైన రికార్డులు లేని 88 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అందులో 30 కి పైగా వాహనాలను ఒకే వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం చేసుకోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. అతడు మోటారు సైకిళ్లు, స్కూటర్లను తాకట్టు పెట్టుకుంటాడని, ఈ క్రమంలో వాహనాలు పేరుకుపోయాయని... పోలీసులు ఆ దిశగా విచారిస్తున్నట్టు తెలిసింది. మైనర్లకు, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువని సీఐ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాల రికార్డులను ఉంచుకోవాలన్నారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బి.కొత్తూరులో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది తెల్లవారుజామునే గ్రామానికి చేరుకుని అనుమానితుల గృహాలు, మోటారు సైకిళ్లు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎటువంటి రికార్డులు లేని 50 మోటారు సైకిళ్లు, ఒక ఆటో, ఒక వ్యాన్ స్వాధీనం చేసుకున్నారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్ఐలు జానీబాషా, ఎన్.రామకృష్ణ, మణికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): వాలుతిమ్మాపురం వెళ్లే రహదారిలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్ద సీఐ విజయశంకర్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు నిర్వహించారు. నెంబరు ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మౌనిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కవిత్వ సంపుటిని ఆవిష్కరిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్

'చిగురించే పేజీలు' పుస్తకావిష్కరణ


కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, కవి దొండపాటి నాగజ్యోతిశేఖర్ రచించిన 'చిగురించే పేజీలు' పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు, కవి, విమర్శకుడు బెల్లంకొండ ప్రసేన్ రామరావుపేటలోని సుబ్బయ్య రెసిడెన్సీలో ఆదివారం ఆవిష్కరించారు. జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గదుల నాగేశ్వరరావు, కట్టా కృష్ణారావు, పద్మజావాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అద్దేపల్లి ప్రభు, బొల్లోజుబాబా పుస్తక సమీక్ష చేశారు. సాహితీ స్రవంతి తరపున నాగజ్యోతిని సత్కరించారు. నగరానికి చెందిన సాహితీ ప్రియులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

'నాగేశ్వరరావు మాస్టారు చిరస్మరణీయుడు'


స్మృతి సభలో మాట్లాడుతున్న వక్త

సామర్లకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా భజన సమాజాల వ్యవస్థాపకుడు, వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారి దివ్య స్మృతి సభను ఆదివారం వేట్లపాలెంలో ఆవరణలో నిర్వహించారు. మోరంపూడి వెంకటేశ్వరరావు మాస్టారు అధ్యక్షతన జరిగిన సభకు సుమారు 220 భజన సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. స్వగ్రామంలోనే గాక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఎన్నో ఆలయాల్లో నాగేశ్వరరావు మాస్టారు ఆధ్యాత్మిక పరిమళాలు గుబాళింపజేశారని పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు. అనంతరం భజన సంఘాల ప్రతినిధులతో కలిసి సుమారు వెయ్యి మంది భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్ చౌదరి, మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్, గంగవరం మాస్టారు, పారిశ్రామికవేత్త నున్న నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పిఠాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పట్టణంలోని ఆరుగురికి రూ.4లక్షలు మంజూరయ్యాయి. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం వారి ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బొజ్జా సతీష్, నాయకులు సోము సత్యనారాయణ, పిల్లి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు

గొల్లప్రోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు కురిసిన సమయాల్లో నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా ఉండేందుకు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు నియోజకవర్గంలోని పంట కాలువలు, డ్రైన్లలో పూడికలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. ఆదివారం ఎక్కడిక్కడ ఎక్స్‌కవేటర్లు ఏర్పాటుచేసి గుర్రపుడెక్క తొలగించారు. గ్రామాల్లో నీరు పోయేందుకు వీలుగా మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు రామ్‌కుమార్ తెలిపారు.

8న భారతీయ బౌద్ధ వారసత్వ సాంస్కృతిక మహోత్సవం


కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరంలోని ప్రాచీన బౌద్ధ క్షేత్రం వద్ద వచ్చే నెల 8న జరిగే భారతీయ బౌద్ధ వారసత్వ సాంస్కృతిక మహోత్సవాల కరపత్రాన్ని ఆదివారం కాకినాడ ఎస్.అచ్చుతాపురంలోని అంబేడ్కర్ బుద్ధ విహార్‌లో అధ్యక్షుడు, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి డాక్టర్ కె.బాబ్జీ ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మునిమనవడు, భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజారత్న అశోక్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగాను, వివిధ రాష్ట్రాలకు చెందిన పూజ్య భంతేజీలు త్రిగుణ వందన, ధమ్మ ప్రవచనం చేసేందుకు విచ్చేస్తున్నారని ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ కన్వీనర్ మద్రి బాబ్జీ, కార్యదర్శి, జన చైతన్య మండలి వ్యవస్థాపకుడు పెయ్యల పావనప్రసాద్, బుద్ధవిహార్ పూర్వ అధ్యక్షుడు ఎ.రామేశ్వరరావు, వీవీ సత్యనారాయణ, డాక్టర్ ఎం.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా రాజు


నూతన అధ్యక్షుడు రాజుతో బ్రాహ్మణ సంఘం సభ్యులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడిగా చింతలపూడి చిట్టి సత్తిరాజు (రాయ్ పబ్లిక్ స్కూల్ రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విద్యుత్ నగర్‌లోని చల్లా కల్యాణ మండపంలో జరిగిన బ్రాహ్మణుల సమావేశం జరిగింది. రాజు పేరును ప్రతిపాదిస్తూ పూర్వ అధ్యక్షుడు అజరపు సత్యనారాయణమూర్తి తీర్మానం ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటానని నూతన అధ్యక్షుడు రాజు తెలిపారు. సమావేశంలో సాయిరాం భగవత్, పద్మనాభస్వామి, మహాశయ, ముంజులూరు విశ్వేశ్వరరావు, కడియాల సత్యనారాయణ, వ్యాఘ్ర, సీహెచ్‌వీ రమణమూర్తి, రామనాథం, భమిడి శివమూర్తి దంపతులు పాల్గొన్నారు.

రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా శేఖర్



కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ జోనల్ సభ్యుడిగా ఎన్‌వీఎల్ శేఖర్‌ను నియమిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన ఈయన్ను దక్షిణ మధ్య రైల్వేలో ప్రత్యేక ఆసక్తి వర్గం కింద నామినేట్ చేశారు. రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.


క్రీడా పరికరాలు అందజేస్తున్న బాదం బాలకృష్ణ

పేద విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ

కాకినాడ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సేవా యజ్ఞంలో భాగంగా లయన్స్ క్లబ్ కాకినాడ సఖి అధ్యక్షురాలు లయన్ డి.సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ బాదం బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 50 బిల్డింగ్స్ సెంటర్లోని వసతిగృహంలోని పేద విద్యార్థులకు క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్, చదరంగం బోర్డులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు రమణి, కుమారి, రమారాణి, రత్నమాల, శ్రావ్య పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

సంక్షేమ వసతిగృహం పరిశీలన

పెద్దాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహారాణి కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం పరిశీలించారు. సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్ శ్రీవల్లిని ఆదేశించారు.

'మన్ కీ బాత్' వీక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన 127వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నగరంలోని శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటకూరి సూర్యనారాయణరాజు, రాష్ట్ర మేథావుల సంఘం కన్వీనర్ డాక్టర్ ముత్తా నవీన్‌కృష్ణ వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేమాతరం రూపొందించి వచ్చే నెల 7వ తేదీకి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులనే వినియోగించాలన్నారు. ఈ నెల 31న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

కబడ్డీ, ఫెన్సింగ్ పోటీలకు పీఆర్ కళాశాల విద్యార్థినుల ఎంపిక

కాకినాడ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టులోని వినాయక మిషన్ యూనివర్శిటీలో ఈ నెల 29 నుంచి జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే అక్నూ జట్టుకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు చెందిన అరుణ, రాజానాగమణి ఎంపికయ్యారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్ యూనివర్శిటీలో జరిగే అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ పోటీలకు దీపిక ఎంపికైంది. విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు, పీడీలు వెంకటరమణ, వర్మ అభినందించారు.

వైద్య శిబిరం సందర్శన

సామర్లకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేపథ్యంలో సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో భీమేశ్వరాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం మధ్యాహ్నం సందర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు షుగర్, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. టీడీపీ నేతలు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), వల్లూరి దొరబాబు, గొలితి సత్యనారాయణ, ఈవో బళ్ల నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం పరదేశమ్మపేట, నాగరాజుపేట ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక పునరావాస కేంద్రాలను కార్పొరేషన్ కమిషనరు కేటీ సుధాకర్, తహసీల్దారు జితేంద్ర, డిప్యూటీ కమిషనరు శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్ పరిశీలించారు. అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు.

'ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం దోమాడ ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మణికంఠ రూ.7లక్షల అవకతవకలకు పాల్పడ్డాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి, డ్వామా పీడీ వెంకటలక్ష్మికి ఆదివారం పలువురు ఫిర్యాదు చేశారు. ఆ వ్యవహారంపై విచారణ చేయాలని పెదపూడి ఎంపీడీవోను పీడీ ఆదేశించారు.



ఆకట్టుకున్న భజన కార్యక్రమం

అన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):రత్నగిరిపై కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కుంపట్ల బాపన్ననాయుడు ఆ ధ్వర్యంలో కోనసీమ, గొల్లప్రోలు భజన కళాకారులు సప్తాహ మహోత్సవంలో ఆది వారం ఉదయం నుంచి విడతలవారీగా భజన కార్యక్రమం నిర్వహించారు,

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పునరావాస కేంద్రాల ఏర్పాటు

రంపచోడవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తుఫాన్ దృష్ట్యా ప్రభుత్వం అందించే సూచనలు పాటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ రద్దు

ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తుపాను ప్రభావంతో రద్దు చేసినట్టు ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. రానున్న మూడు రోజులపాటు భారీ వర్షాలు కురి సే అవకాశం ఉందని, గిరిజన ప్రాంత ప్రజలు గమనించాలని కోరారు.

తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎటపాక, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎటపాక తహసీల్దార్ కార్యాల యంలో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన ట్టు తహసీల్దార్ కారం సుబ్బారావు ఆదివారం ఓ ప్రకనటలో తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకు ఈదురు గాలులతో భారీ వర్షాలు పడే అవ కాశాలున్నట్టు ఐఎండీ తెలిపిందని చెప్పారు. లోతట్టువాసులు, శిథిలావస్థ ఉన్న ఇళ్లలో ఉండే వారు వెంటనే ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం తహసీల్దార్ కార్యాల యంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్ర దించాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లోని 83090 29520, 8885425365లో సంప్రదించాలన్నారు.

ఐటీడీఏ ముట్టడికి మద్దతు

రంపచోడవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆదివాసీల స మస్యలపై అఖిలభారత రైతుకూలీసంఘం ఆధ్వ ర్యంలో ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బాలు అక్కిస, భారత్ ఆదివాసీ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి మద్దిలేటి అంజిరెడ్డి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్టు ఆది వారం ప్రకటనలో తెలిపారు.

తల్లీబిడ్డ మృతికి కారకులపై కేసు నమోదు చేయాలి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఇటీవల తల్లి, బిడ్డ మృతికి కారణమైన వైద్యులపై కేసులు నమో దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆదివారం ప్రకటన లో డిమాండ్ చేశారు. బాధ్యతపై తక్షణమే చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రంపచోడవరంలో డ్రంక్ అండ్ డ్రైవ్

రంపచోడవరంలో ఆదివారం సాయంత్రం సీఐ సన్యాసినాయుడు పర్యవేక్షణలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానాలు వేశారు. పర్యాటక ప్రాంతాలకు ఎవరూ వెళ్లొద్దని సూచించారు. వేగనియంత్రణ పాటించాలని అవగాహన కల్పించారు. తనిఖీల్లో అడిషనల్ ఎస్సై భూషణం, ట్రైనీ ఎస్‌ఐ రాజ్‌కోటి పాల్గొన్నారు.

ఆంధ్రాలో రహదారి మరమ్మతులు

● పనులు ప్రారంభించిన టీఎస్ ఎండీసీ అధికారులు



మరమ్మతు పనులు చేపడుతున్న దృశ్యం

ఎటపాక అక్టోబరు26(ఎట పాక): భద్రాచలం-చర్ల అంత రాష్ట్ర రహదారి పూర్తిగా పాడైపో వడంతో తాత్కాలిక మరమ్మతు పనులు ప్రారంభించారు. తెలంగాణ ఎండీసీ కేటాయించిన రూ.30 లక్షల నిధులతో అంధ్ర సరిహద్దు పరిధిలోని ఎటపాక నుంచి తెలంగాణలోని చర్ల మండలం వరకు రోడ్డు మరమ్మతులను నిర్వహిస్తున్నారు. ఇటీవల తెలంగాణ ఇసుక లారీలవలన అంధ్రలోని కన్నాయిగూడెం, చింతలగూడెం, ఎటపాకలో ప్రధాన రహదారులు ధ్వంసమవుతున్నాయని, ఇసుక లారీలు ప్రమాదకరరీతిలో రాకపోకలు సా గిస్తున్నాయని ఆరోపిస్తూ కన్నాయిగూడెం గ్రామస్థులు లారీలను అడ్డుకున్నారు. దీంతో స్పందించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వెంటనే రహదారి మరమ్మతులు చేస్తామని కన్నాయి గూడెం వాసులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చొరవతీసుకుని టీఎస్‌ఎండీసీ అధికారులతో మాట్లాడారు. పూర్తిగా పాడైపోయిన రహదారిని పునరుద్ధరించిన అనంతరమే లారీలను తిప్పాలని కోరడంతో టీఎస్ (తెలంగాణ)ఎండీసీ నిధులను కేటాయించింది. దీంతో ఎటపాక నుంచి మరమ్మతుల పనులు సాగుతున్నాయి.

తులసిపాక వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల రద్దీ



తులసిపాక వ్యూ పాయింట్‌వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

మోతుగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మన్యంలోని పర్యాటక కేంద్రాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. కార్తీకమాసం పిక్నిక్ సీజన్‌తోపాటు వీకెండ్ కావడంతోను దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చారు. పొల్లూరు జలపాతం పుష్ప షూటింగ్ బ్రిడ్జి, పిక్నిక్ స్పాట్, పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలి వచ్చారు. దీంతో తెల్లవారుజామున 5గంటల నుంచి ఫోర్‌బై డ్యాం, పొల్లూరు జలపాతం సందడి ప్రారంభమైంది. తులసిపాక వ్యూపాయింట్‌వద్ద సందర్శకులు ఫోటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. సాయంత్రంవరకు పొల్లూరు జలపాతాలు, పర్యాటక ప్రాంతాలు కిక్కిరిశాయి

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

మోతుగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలపై డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ ప్రజలకు అవగాహన కల్పించారు. డొంకరాయిలో ఆదివారం టీడీపీ సమావే శం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకోసం ఎన్నో పథకాలు అమ లు చేస్తున్నామన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో విజ యమే ధ్యేయం గా పనిచేయాలన్నారు. టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రేమ్‌కిర ణ్, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నీలపు సత్యనారాయణ, మండల కార్యదర్శి మద్దాల యాకబ్, యూనిట్ ఇన్‌చార్జ్ దుంగరాజు ఈకార్యక్రమంలో గుర్రప్ప, టీడీపీ సీనియర్ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



డొంకరాయిలో మాట్లాడుతున్న డొంకరాయి టీడీపీ ఎంపీటీసీ వెంకటరమణ

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



చోడిపల్లిపేటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీధర్



ప్రత్తిపాడులో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సబ్ కలెక్టర్



ఏలేరు కాలువను పరిశీలిస్తున్న అధికారులు

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● యనమల ఆదేశాలతో మత్స్యకారులకు భరోసా కల్పించిన టీడీపీ నేతలు

● 29 పునరావాస కేంద్రాల ఏర్పాటు

● సురక్షిత ప్రాంతాలకు తరలిరండి

తొండంగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కాకినాడ సమీపంలో తీరాన్ని తాకుతుందన్న వాతావరణశాఖ సూచనలతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం సుదూర తీరప్రాంతం కలిగిన తొండంగి మండల తీర గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్, మండల ప్రత్యేకాధికారి ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, తహశీల్దార్ కాంతారావు, ఎంపీడీవో సాయి నవీన్‌లతోపాటు వివిధశాఖల అధికార్లు పెరుమాళ్ళపురం పంచాయతీలో తీరానికి అత్యంత దగ్గరగా గల కొత్తచోడిపల్లిపేటను సందర్శించారు. స్థానికులతో సమావేశమై తుఫాను తీవ్రత దాని ప్రభావంతో సమకూరే నష్టం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తుఫాను పట్ల ఏమాత్రం ఏమరుపాటు తగదని ప్రభుత్వం కాలానుగుణంగా ఇచ్చే సూచనలు పాటించడంద్వారా ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చూసుకోవచ్చని దీనికి అందరూ సహకరించాలన్నారు. మండలంలో 29 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలంతా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. పెరుమాళ్ళపురంలో ముంపును నివారించే నిమిత్తం ఎక్స్‌కవేటర్‌తో కాల్వను తవ్వించారు. అనంతరం తీర ప్రాంతానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. వలలు పడవలను ఒడ్డుకు చేర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో అధికార్లు సిద్ధంగా ఉన్నారని, మండల కేంద్రంలో కంట్రోల్‌రూం ఏర్పాటుచేశామని ఏ పరిస్థితి ఎదురైనా సమాచారం అందించి సహాయంపొందాలన్నారు.

మత్స్యకారులు ధైర్యంగా ఉండాలి

తుపాను సమయంలో మత్స్యకారులంతా ధైర్యంగా ఉండాలని టీడీపీ పార్టీ, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు తామంతా గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు యనమల జిల్లా యంత్రాంగంతో మాట్లాడుతున్నారన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధపరిచామన్నారు. టీడీపీని కేడర్ మొత్తం తీర గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. తుఫాను నుంచి బయట పడేందుకు అధికార్ల సూచనలు పాటించాలని యనమల సూచించారన్నారు. టీడీపీ తుని మండల అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, తుని మాజీ మున్సిపల్ చైర్మన్ యినుగంటి సత్యన్నారాయణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటమణ, చొక్కా మణికుమార్, చొక్కా అప్పారావు, మహంకాళి, గంటా లక్ష్మణ్ ఉన్నారు.

ఇళ్లకు వెళ్లిపోయిన హాస్టల్ విద్యార్థులు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రానికి హాస్టల్ విద్యార్థులంతా తమ ఇళ్లకు బయలుదేరి వెళ్లారు. తుఫాను తీవ్రత అధికంగా ఉంటుందన్న హెచ్చరిక నేపథ్యంలో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు అద్దరిపేట, యల్లయ్యపేట, రావికంపాడు, గొర్సపాలెం హాస్టల్ విద్యార్థులతోపాటు వాకదారిపేట కేజీబీవీ విద్యార్థులు కూడా ఇళ్లకు తరలివెళ్లారు. ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి విద్యార్థినుల తల్లి దండ్రులను రప్పించి వారికి తమ పిల్లల్ని అప్పగించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను దృష్ట్యా గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎన్వీ నరేష్, ఎంపీడీవో శివరా మ కృష్ణయ్య అన్నారు. వివిధశాఖల అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జనరేటర్లు, సహాయక చర్యలు నిమిత్తం జేసీబీ మిషన్లు సిద్ధం చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. రౌతులపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలు నిమిత్తం 40 బేడ్లు సి ద్ధం చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు తహశీల్దార్ తెలిపారు. వర్షం ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా 50 స్తంభాలు 50మంది కూలీలు సిద్ధంగా ఉన్నట్టు విద్యుత్‌శాఖాధికారి చినబాబు తెలిపారు. రౌతు లపూడిలో కంట్రోలురూమ్ ఏర్పాటుచేశారు. తహశీ ల్దార్ కార్యాలయంలో 9951947710 విద్యుత్ ఉపకేంద్రంలో 9490614820కు కాల్ చేయాలన్నారు.

సబ్ కలెక్టర్ వేణుగోపాల్‌రావు సమీక్ష

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ప్రత్తిపాడు తహసల్దార్ కార్యాలయంలో మొంథా తుఫాను మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ సబ్‌కలెక్టర్ వేణుగోపాలరావు సమీక్ష నిర్వహించారు. మండలస్థాయి అధికారులతో తుఫాన్ పునరావాస ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, అగ్రికల్చర్ ఆఫీసర్ అమృత, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీవల్లితోపాటు మండ లస్థాయి అధికారులు పాల్గొన్నారు. తుఫాన్ ఎదుర్కొ నే చర్యలపై ఈ సమాజంలో చర్చించి డిప్యూటీ సబ్‌కలెక్టర్ మార్గదర్శకాలు నిర్దేశించారు. ప్రత్తిపాడు మండలంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ ఆధ్వర్యంలో మొంథా తుఫాన్ హెచ్చరికలు ఆటోలలో మైకులు ఏర్పాటుచేసి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

కిర్లంపూడి,(ఆంధ్రజ్యోతి):భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కిర్లంపూడి మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ డామేజ్ అయిన ప్రదేశాలను, ముక్కోలు రెగ్యులేటర్ ను, రాజపాలెం బ్రిడ్జి పరిస్థితి ఏలేరు ప్రా జెక్టు చైర్మన్ బస్వా వీరబాబుతో కలిసి పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి ఆదివారం పరిశీలించారు. పలు చెక్ డ్యామ్‌లు, బ్రిడ్జిలను పరిశీలించి తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకుంటూ తీసుకోవాలని జాగ్రత్తలను ఏలేరు ప్రాజెక్ట్ కమి టీ చైర్మన్ బస్వా వీరబాబుకు తెలియజేస్తున్నారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.చిరంజీవి, ఎంపీడీవో బి.హరికృష్ణ, ఏవో ఎస్.సుదామాధురి, ఏఈవో ఆకుల సురేష్, ముక్కోలు సర్పంచ్ జ్యోతుల రాంబాబు, వీరవరం సొసైటీ అధ్యక్షుడు తోట గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

జగ్గంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.జవహర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థులతో జవహర్ మాట్లాడి అక్కడున్న వసతులు గురించి అడిగి తెలుసుకు న్నారు. హాస్టల్లో వసతులను క్షుణ్ణంగా పరిశీలించి వారికి కావలసిన వసతులను కల్పిస్తామని విద్యార్థులకు హామీఇచ్చారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వసతి గృహంలో లైట్లు ఫ్యాన్లు కొన్ని మరమ్మతులు చేయాలని, కావలసిన వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు హాస్టల్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు

కోడూరి వెంకట్రావు ఆదర్శనీయుడు

మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన టీడీపీ నేత జగ్గంపేట గ్రామపంచా యతీవార్డు సభ్యుడు కోడూరి సత్యనారా యణ, శివరామకృష్ణల తండ్రి వెంకట్రావు ఇటీవలే మరణించడంతో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ సీతానగరంలోని సత్యనారాయణ స్వగృహంలో వెంకట్రావు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం కోడూరి సత్యనారాయణ, శివరామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. మరణానంతరం నేత్రదానం చేసిన కోడూరి వెంకట్రావుని స్మరించుకుంటూ అన్ని దానాల కన్నా నేత్రదానం గొప్పదని జవహర్ ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జిల్లా విభిన్న ప్రతి భావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర, జగ్గంపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంద్రశేఖర్, తాతినేని నాగేశ్వరరావు, కుదప మురళీకృష్ణ, పిండి రెడ్డమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ వల్లి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరణ

జగ్గంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):జగ్గంపేట వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహం, రాష్ట్ర విద్యార్థి విభాగం జోన్2 వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రావుల గణేష్ రాజా మాట్లాడుతూ కాలేజీలను ప్రైవేటీకరణ చేయ డం ద్వారా పేద ప్రజలు, పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడతారని, రానున్న రోజులలో ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్య, అందని ద్రాక్షగా మారుతుందని మెడికల్ కాలేజీ సీట్లు కూడా పేద ప్రజలకు దొరకవు అని ఆయన వివరించారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుల్లా రాము, రాష్ట్ర పబ్లిసిటీ విభాగం రామకుర్తి జాగాలు, జగ్గంపేటటౌన్ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్, జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు రావుల సురేష్ కుమార్, కాట్రావులపల్లి గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, గుర్రం మహాలక్ష్మి, కరటూరి వీర్రాజు,మండల ఉపాధ్యక్షులు భూమాడ గణపతిరావు పాల్గొన్నారు.

లింగంపర్తిలో వనసమారాధన

ఏలేశ్వరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తి గ్రామంలో శ్రీవేద గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. ఉదయం విఘ్నేశ్వరస్వామికి, రావి, ఉసిరి చెట్లకు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అవసరాల కిశోర్, గాధావధుల నర్సింహమూర్తి, వై. నాగసిద్ధాంతి, సంపర రాంకుమార్, ఓలేటి చంటిబాబు, యలమంచిలి శేఖర్, అనపర్తి ఉదయ్, బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఆదివారం మధ్యాహ్నం నుంచి తుఫాన్ వాతావరణం నెలకొని తీవ్రస్థాయిలో వర్షం పడింది. ఒక వైపు మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఒక్కసారిగా వాతావరణం మారి కుండపోత వర్షం పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈనెల 27నుంచి 31వ తేదీ వరకు 5రోజులుగా కలెక్టర్ షన్ మోహన్ షగిలి మొంథా తుఫాన్ నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించి ముందస్తు జాగ్రత్త చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్తిపాడు ప్రాంతంలో ప్రజలు సోమవారం నుంచి తుఫాన్ ప్రభావం కనిపిస్తోందని దీంతో వర్షాలు పడవచ్చని అంచనాలు తారుమారుచేస్తూ ఆదివారం మధ్యాహ్నం నుంచే కుండపోత వర్షం మొదలుకావడంతో భయాందోళనకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉండగా ఒక్కసారిగా మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆకాశంలో కారుమబ్బులు కమ్మి తుఫాన్ ప్రభావంతో భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఒకవైపు ఖరీఫ్ వ్యవసాయపనుల్లో తలమునకలైన రైతాంగం ఈ వర్షం కారణంగా పంటలను ఏవిధంగా రక్షించుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది.



రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): అతి భారీవర్ష ప్రభా వంరీత్యా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు సెలవులు ఇచ్చారు. వసతి గృహం విద్యార్థులను స్వగ్రామాలకు పంపించారు. మండలంలోని భారీ వర్షం కురవడంతో రహదారులు జలమయంగా మారాయి. అధికారులు అప్రమత్తమయ్యారు. రౌతులపూడి ఏటికాలువ సమీపంలో తూర్పుమధుం గట్టు తరచూ తుపాను దాటికి దెబ్బతింటుంది. ఈగట్టును తహశీల్దార్ ఎన్వీ నరేష్ పరిశీ లించారు. గ్రా మాల్లో వీఆర్వోలను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నా వీఆర్వోలు అక్కడే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.


చర్చి నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తునిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుని స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. కార్యవర్గ సభ్యులుగా ప్రెసిడెంట్‌గా టి.వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్‌గా డి.నిలావతి, సెక్రటరీ ఏఎఫ్ సుకుమార్, జాయింట్ సెక్రటరీ ఎ.మణికుమార్, ట్రెజరర్ దల్లి అమర్‌నాథ్, జాయింట్ సెక్రటరీ ఎస్. వరప్రసాద్, నామినేటింగ్ కమిటీ కన్వీనర్ ఏజీ కే జాన్, పికన్ బోర్డు చైర్మన్ బీజేవీ ప్రసాద్, సెమెంట్రీ కమిటీ కన్వీనర్ డి.సాల్మన్ రాజు, స్త్రీల సమాజ ప్రెసిడెంట్ ఎస్.జయప్రదలు ఎన్నికయ్యారు.

ఏలేశ్వరంలో సత్య దీక్షలు స్వీకరణ



దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

ఏలేశ్వరం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ఏలేరు నదీతీరాన ఉన్న శ్రీఅనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం సత్యదీక్షలు స్వీకరించారు. ఆలయ అర్చకులు పొన్నూరి సత్యనారాయణచార్యులు, బుజ్జి, చక్రవర్తుల రాఘవాచార్యులు గణపతి పూజ, స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. జగ్గంపేట, ఏలేశ్వరం మండలాలకు చెందిన భక్తులు 18రోజులకుగాను సుమారు 52 మంది మాలధారణ చేశారు. సత్య దీక్షల ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణమోహన్, దొడ్డిపట్ల సుబ్బారావు, లక్ష్మీదేవి, అలమండ పెద చలమయ్య పాల్గొన్నారు.

గంటా సేవలు చిరస్మరణీయం



ప్రత్తిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం లంపకులోవ గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ గంటా సత్య నారాయణ వర్ధంతిని నిర్వహించారు. లంపకలోవలో మాజీ సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్ ఆధ్వర్యంలో గంటా విగ్రహానికి నాయకులు, గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంపకలోవ సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. గంటా మహాలక్ష్మిరావు, గంటా రాంబాబు, గంటా శ్రీను, గంగబాబుతో పాటు అభిమానులు పాల్గొన్నారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

● ప్రభుత్వ విప్ యనమల దివ్య



తునిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ యనమల దివ్య ఆదేశించారు. తుఫాన్ నుంచి తుని, కాకినాడ మధ్య తీరందాటే అవకాశం ఉందని తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పరిస్థితులు నిరంతరం సమీక్షించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేయాలని ఆదేశించిందని అందుకు తగ్గట్టుగా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాలపై మొంథా ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ఆస్తి, ప్రాణనష్టం కలుగకుండా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంతాలను అప్రమత్తం చేయాలని, జాలర్లను చేపల వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. తాండవ, పంపా జలశయాల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షణ కోసం లోతట్టు ప్రాంతాల ప్రజలను అలెర్ట్ చేయాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్,వ్యవసాయశాఖ, అన్నిశాఖల సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు.

రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంవద్ద గంగాహారతి



పుష్కరిణి వద్ద గంగామాతకు హారతులు ఇస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయ పుష్కరిణివద్ద ఆదివారం సాయంత్రం గంగాహారతిని నిర్వహించారు. కార్తీకమాస సందర్భంగా ఆలయం వద్ద గల పుష్కరిణివద్ద వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఈ గంగాహారతిని నిర్వహించారు. అలాగే అరుణాచలేశ్వర ఆలయం ఎదుటగల ధ్వజ స్తంభం సమీపంలో ఆకాశ దీపాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రమణానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో ఏకాదశ రుద్రాభిషేకం

కిర్లంపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణార్థం, ప్రజలంతా ఆరోగ్యంగా ఆనందంగా ఆధ్యాత్మికంగా వర్ధిల్లాలనే లక్ష్యంతో రామచంద్రపురం గ్రామంలో జనసేన జగ్గంపేట ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ పర్యవేక్షణలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్ర వేదాధ్యయన సమన్వయకర్త డాక్టర్ కొరారు సాయి శ్రీ హరిప్రసాద్ శర్మ అన్నారు. అనంతరం 2వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి చిట్టిబాబు, జనసేన పార్టీ స్టేట్ ప్రోగ్రామింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి సాయిచందు, రామచంద్రపురం ఎంపీటీసీ బండారు ప్రసాద్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, తుమ్మలపల్లి చిట్టి కామేశ్వరి పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులు ఛేదించిన పోలీసులు

గండేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మిస్సింగ్ కేసులపై గండేపల్లి ఎస్‌ఐ యువీ శివ నాగబాబు ప్రత్యేక దృష్టిపెట్టారు. కరప మండలానికి చెందిన ఒకరు గండేపల్లి మండలం మురారిలో అదృశ్యమయ్యాడు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేయగా అతను అల్లూరి జిల్లాలో ఉన్నట్లు గుర్తించి అతన్ని తీసుకువచ్చి అతని తల్లిదండ్రులకు అప్పగించారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన ఒక వివాహితురాలు అదృశ్యమైంది. దీనిపై కేసు నమోదుచేసి ఆమెను వెతకగా కాకినాడజిల్లా గొల్లప్రోలులో ఉన్నట్లు గుర్తించి ఆమెను తీసుకువచ్చి ఆమె తల్లి, భర్తకు అప్పగించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టిన గండేపల్లి ఎస్‌ఐను పలువురు అభినందిస్తున్నారు.

లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.1.73లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి కార్తీకమాసం కావడంతో భక్తుల రద్దీ తగ్గింది. ఆదివారం ఆలయానికి సాధారణ భక్తులు రావడంతో ఆదాయం రూ.1.73లక్షలు సమకూరింది. ఆలయ వసతి గదులు ఖాళీగా దర్శనమిచ్చాయి.

ఉపాధ్యాయులకు సత్కారం

రౌతులపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పారుపాక గ్రామంలో శ్రీసాయి అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఫౌండేషన్ అధినేత వి.గిరీష్‌బాబు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గాడి కొండబాబు, టీడీపీనేత కోసూరి కృష్ణవర్మ, సర్పంచ్ పక్కుర్తి జయలక్ష్మి, ఎంపీటీసీ గెద్దం వెంకటలక్ష్మి, పీఏసీఎస్ డైరెక్టర్ జయసింగ్‌రావు, హెచ్‌ఎం వెంకట శివ పాల్గొన్నారు.

యాళ్ల జగదీష్ దంపతుల పూజలు

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్ మంగాదేవి దంపతులు ఆదివారం ప్రత్తిపాడులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముంచుకొస్తున్న తుఫాన్ కారణంగా నియోజకవర్గ ప్రజలు సురక్షితంగా ఉండి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాపాడాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించారు.